ప్రజాశక్తి

శుక్రవారం 20 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రేటులో చేతివాటం!

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

- రైతు బజార్లలో అమలవ్వని నిర్ధారిత ధరలు
- నాణ్యతలేని సరుకుతో నిర్వీర్యానికి యత్నాలు
- అద్దెలు అధికమైనా సౌకర్యాలు శూన్యం
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

గుంటూరులోని పలు రైతు బజార్ల ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాణ్యత లేని సరుకు తీసుకు రావడం, మార్కెట్‌లో ఉన్న ధరలకు కొంత తగ్గింపుతో ధరలు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేయడం పరిపాటైంది. బోర్డు నిర్ధారించిన ధరలకు విక్రయాలు జరగడం లేదు. బోర్డుపై ఉన్న ధరల కంటే వ్యాపారులు అధికంగా విక్రయిస్తున్నా ఎస్టేట్ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అంతేగాక విక్రయదారుల నుంచి ఎస్టేట్ అధికారులు కిలోకి రూ.2 చొప్పున కమిషన్లు పొందుతున్నారనే ఆరోపణలూ ప్రభలంగా వినిపిస్తున్నాయి.

ప్రధానంగా గుంటూరులోని పట్టాభిపురం రైతు బజారులో బోర్డులో ఉన్న ధరలు అమలు కాని పరిస్థితి నెలకొంటోంది. విక్రయదారులు చెప్పిన ధరకే కొనుగోలు చేసి వెళ్లాల్సిన పరిస్థితి వినియోగదారులకు ఎదురవుతోంది. కార్పొరేషన్ స్థలంలో మార్కెటింగ్ శాఖ అధికారులు విక్రయదారుల నుంచి నెలకు రూ.7 వేలు వసూలు చేస్తారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించరు. వ్యాపారులు, రైతులు ఎవరి గుడారం, గొడుగు వారు ఏర్పాటు చేసుకోవాల్సిందే. వర్షం వస్తే వారి

తాము వేసుకున్న పందిర్ల కిందే విక్రయాలు చేపట్టిన రైతులు

పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. కూరగాయాలు, పండ్లు, పూలు విక్రయించుకునే వారి నుంచి నెలకు రూ.7 వేలు వసూలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ కనీస సదుపాయాల కల్పనపై దృష్టి సారించడం లేదు.

మరోవైపు రైతు బజార్ల వద్ద ధరలు నిర్ధారణలోనూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. విజయవాడ రైతు బజార్ కంటే ప్రతి రకం మూడు నుంచి ఐదు రూపాయల వరకు అదనంగా నిర్ధారిస్తున్నారు. జిల్లాలో పండుతున్న కూరగాయాలకు కూడా అధిక వసూలు చేయడం విమర్శలకు దారితీస్తోంది. అధికారులు నమోదు చేసిన బోర్డుపై ఉన్న రేటుకు వ్యాపారులు విక్రయించకపోయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న రైతు బజార్‌లో మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేదు. దుర్గంధం అలుముకుంటుంది. వర్షం 2లో

ఎల్ఐసి పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్ఐసి సిబ్బంది

ఎల్ఐసి మరింత శక్తివంతం కావాలి

ఎల్ఐసి ఆఫీసుల వద్ద సంస్థ జాతీయరణ దినోత్సవంలో నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పాలసీదారుల సొమ్ముకు భద్రత కల్పించటంలో ప్రైవేటు బీమా రంగం ఘోరంగా విఫలమైన నేపథ్యంలో 1956లో అప్పటి 245 ప్రైవేటు బీమా సంస్థలను విలీనం చేయటం ద్వారా ప్రభుత్వ రంగంలో ఎల్ఐసిని ఏర్పాటు చేశారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆర్‌విఎస్ శ్రీనివాస్ అన్నారు. ఎల్ఐసి జాతీయకరణ దినోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం నగరంలోని ఎల్ఐసి కార్యాలయాల వద్ద వివిధ కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వరంగ ఎల్ఐసిని పరిరక్షించుకొని సంస్థను మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అరండల్‌పేట ఎల్ఐసి కార్యాలయం వద్ద జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన ఎల్ఐసి నేటికి రూ.42 లక్షల కోట్ల ఆస్తులతో అగ్రగామి ఆర్థిక సంస్థగా నిలిచిందన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ అధ్యక్షులు బి.మార్కండేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రతి ప్రభుత్వరంగ సంస్థను సమూలంగా ప్రైవేటీకరించేందుకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, అందుకు చట్టాలను సైతం మారుస్తోందని విమర్శించారు. దేశ ఆర్థిక స్వావలంబనకు ప్రత్యక్ష చిహ్నంగా ఉన్న ఎల్ఐసిని, ఏజెంట్ల వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని చెప్పారు. దేశం ముందున్న పలు సవాళ్ల నేపథ్యంలో ఎల్ఐసి మరింత శక్తివంతం కావాలని అన్నారు. పాలసీదారులు, ఏజెంట్లు, సిబ్బంది ఐక్యతతో 2లో

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల

పురుగుమందు తాగి కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గన్నెబోయిన లింగయ్య (48) కూలి పనులు చేసుకుంటుండడంతోపాటు కౌలుకూ పొలం సాగు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈ ఏడాది రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేపట్టాడు. గురువారం మధ్యాహ్నం పొలానికని వెళ్లిన లింగయ్య కొద్ది సేపటికి 2లో

లింగయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తెలు, లింగయ్య మృతదేహం (ఇన్‌సెట్)

లబ్ధిదార్లను అప్పులపాలు చేయొద్దు

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ 4లో

వార్తలు లోపలి పేజీల్లో

కొండవీడు కొండపై వేమన విగ్రహం వద్ద మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ తదితరులు

వేమన పద్యాలతో ప్రజల్లో చైతన్యం

ఘటనా స్థలిని పరిశీలిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, కలెక్టర్ తదితరులు

తొక్కిలాట ఘటనపై విచారణ ప్రారంభం

సభాస్థలిని సందర్శించిన జస్టిస్ శేషశయనారెడ్డి

వార్త మెయిన్‌లో

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

5 లో

ఛాందస భావాలకు వేమన తొలి అడ్డుకట్ట : ఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట

నివాళులర్పిస్తున్న పల్నాడు ఎస్పీ

ప్రజాకవి, సంఘ సంస్కర్త, ఆటవెలదిని ఈటెగా విసిరిన దిట్ట వేమన అని, ఛాందస భావాలకు తొలి అడ్డుకట్ట వేశాడని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మాట వినని తెలుగు వారు, వానకు తడవనివారు, వేమన పద్యం ఒక్కటైనా వినని తెలుగువారు ఉండరని పేర్కొన్నారు. పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పారని, అనంతమైన విలువ గల సలహాలు, సూచనలు, విలువలు పద్యాల్లో పలికించారని అన్నారు. ప్రపంచ భాషా కవుల్లో గొప్పవారిగా యునెస్కో ఎంపిక చేసిందని గుర్తు చేశారు. కుటుంబ వ్యవస్థలోని లోటు పాట్లు, మతం పేరుతో జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించాడని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.బిందుమాధవ్, ఎఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, నరసరావుపేట రూరల్ ఎస్సై బలనాగిరెడ్డి, సీసీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఇదేం కర్మ..'లో పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

'బాబు, పవన్ కలయికతో వైసిపికి బీపీ'

ప్రజాశక్తి - నరసరావుపేట

చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయికతో వైసిపిలో ఓటమి భయం పట్టుకుందని, ఆ పార్టీ నాయకులకు బీపీ పెరుగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి గెలుపు ఖాయమన్నారు. మండలంలోని ఉప్పలపాడులో గురువారం నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'లో ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చాలా స్పష్టతతో ఉన్నారని, ఈ కలయికను ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. టిడిపి తెచ్చిన సంస్కరణలు, సాధించిన ఘనత నేటి యువతకు తెలియజెప్పేందుకే నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర చేయనున్నారని అన్నారు. ప్రతిపక్షాల పర్యటన అడ్డుకునేందుకు జీవోలు తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, కె.అంకాలు, టి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

గుంటూరు మేయర్‌కు సన్మానం

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడును అమరావతిలోని మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, ఎంపిపి మేకల హనుమంతరావులు గురువారం సత్కరించారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని కోనూరు గ్రామానికి మనోహర్‌నాయుడు వెళ్తూ మార్గమధ్యంలో అక్కడ ఆగారు. ఈ సందర్భంగా అమరావతి మండల సచివాలయ కన్వీనర్ గా నూతనంగా నియమితులైన హనుమంతరావును ఆయన ఆఫీసులో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హనుమంతరావును మనోహర్ నాయుడు సత్కరించారు.

బాలింతలకు పండ్లు, రొట్టెల పంపిణి

ప్రజాశక్తి-నరసరావుపేట

మహారాణా ప్రతాప్ సింగ్ 427వ వర్ధంతి సందర్భంగా లింగంగుంట్ల పరిధిలోని డాక్టర్ వై.ఎస్.ఆర్ జిల్లా హాస్పిటల్‌లో మహా రాణా ప్రతాప్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా బొందిలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆసు పత్రి లోని 50 మందికి పైగా బాలింతలకు పండ్లు , రొట్టెలను పం పిణీ చేశారు. ఈ విషయాన్ని నరసరావు్పేట ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాస్ సింగ్ తెలిపారు. కార్య క్రమంలో డాక్టర్ మంత్రూ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ కెయస్ దయా నిధి బి.సి వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షులు దేవళ్ళ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైఎంసిఎ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసిఎ) ఆధ్వర్యంలో ఫుట్ పాతులపై (రోడ్ల పక్కనే) రాత్రి వేళల్లో నిద్రించే వారికి దుప్పట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చుక్కా విన్సెంట్ పాల్ మాట్లాడుతూ వైఎంసిఎ చిలకలూరిపేట ఉపాధ్యక్షుడు బిల్లా మాణిక్యరావు పుట్టినరోజుని పుర స్కరించుకుని 50 మంది పేదలకు దుప్పట్లను అందజేశామన్నారు. ఈ సందర్భంగా వైఎం సిఎ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. వైఎంసి చిలకలూరిపేట అధ్యక్షులు కె.రామమోహన్‌రావు, కార్యదర్శి పులిపాటి కెనడి, సభ్యులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన సంఘటన సత్తెనపల్లి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మాదాసు వెంకటరమణ, ఆమె కూతురు, అల్లుడు, వారి పిల్లలతో బతుకుదెరువు కోసం సత్తెనపల్లి కి ఆరేళ్ల క్రితం వలస వచ్చారు. పట్టణంలోని కొత్తపేట భావన రుషి నగర్ లో నివాసం ఉంటూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అయితే, వెంకటరమణకు మతిస్థిమితం లేకపోవడంతో గురువారం ఆమెను ఇంటిలోనే ఉంచి బ్యాంకు పనుల నిమిత్తం వెళ్లి తిరిగొచ్చిన కూతురు మల్లేశ్వరి కి తన తల్లి ఇంటిలో కనిపించలేదు. ఇరుగుపొరుగు వారిని ఈ విషయమై ఆరా తీయగా, కనిపించలేదని చెప్పారు. దీంతో, వెంకటరమణ అదశ్యమైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నట్లు వారు తెలిపారు. మాదాసు వెంకటరమణ కు 55 ఏళ్లు ఉంటాయని, ఆమె ఆచూకీ తెలిసినవారు 6302235408, 9025391520 నంబర్లలో సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో మృతి

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లాడ్జిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, లాడ్జిలో తన పేరు కరిముల్లా అని, తనది నెల్లూరు అని చెప్పాడు. సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుంది. లాడ్జిలో మంచం బుధవారం అద్దెకు తీసు కున్నాడు. గురువారం మధ్యాహ్నం మంచంపైనే మృతి చెంది ఉన్నాడు. లాడ్జి నిర్వాహకుల సమా చారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెనాలి

రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారంతో జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, దాదాపు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల అతను, ఈనెల 16న రైల్లో ప్రయాణిస్తూ కొలకలూరు సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. క్షతగాత్రుని గమనించిన స్థానికులు 108 లో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జి ఆర్ పి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గోరుముద్ద'ను విద్యార్థులు తినేలా చూడాలి: ఎంఇఒ

ప్రజాశక్తి-తెనాలి

పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థి తినేలా చూడాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని ఎన్సిఆర్ఎం హైస్కూల్ విద్యార్థులకు అందిస్తున్న ఎండిఎం మెనూ పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు.. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రైమరీ పాఠశాల విద్యార్థుల కంటే, ఉన్నత పాఠశాల విద్యార్థులలో ఎండీఎం తీసుకునే వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయుల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాల హాజరు లోని 85 శాతం మంది విద్యార్థులు ఎండిఎం తినేలా చూడాలన్నారు. అలాగే విద్యా విధానములో వస్తున్న మార్పులను ప్రతి ఉపాధ్యాయుడు అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. సమ్మెటివ్ ఒన్ ఎగ్జామ్ మార్కులను 20వ తేదీలోగా విద్యార్థులకు అందజేసి మెరిట్ స్టూడెంట్ ను, వారి తల్లిదండ్రులను అభినందించాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులు ప్రార్థనా సమయానికి జగనన్న విద్యా కానుక ద్వారా అందించిన యూనిఫామ్, షఉస్ ధరించి హాజరు కావాలన్నారు.. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు ఎండి బషీర్ అహ్మద్, సుధారాణి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీదేవి, మండల అకౌంటెంట్ ఎస్కె సుభాని, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-తెనాలి

అనారోగ్య కారణాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై పట్టణ వన్ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాలు ప్రకారం స్థానిక చినరావూరు రైస్ కాలనీకి చెందిన సారధి శరత్ కుమార్(31) పట్టణంలో ద్విచక్ర వాహన షోరూమ్ లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యంతో ఉన్నాడు. వైద్యుల సలహా మేరకు మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరిస్తుండటంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసి మరింత శక్తివంతం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సంస్థను పాడుకుంటామని తెలిపారు. బ్రాంచి మేనేజర్ వి.మాధవకృష్ణ మాట్లాడుతూ 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి రూ.2.18 కోట్లు కొత్త పాలసీలు సేకరించి, 3.56 శాతం అభివృద్ధిని నమోదు చేసినట్లు తెలిపారు. షేర్ మార్కెట్‌లో ఎల్ఐసి షేర్ తగ్గినా బీమా మార్కెట్ వాటాలో ఎల్ఐసిదే ఆధిపత్యమని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సంయుక్త కార్యదర్శి వివికె సురేష్, డి.శివ రామకృష్ణారావు, పి.ఎం. రవికుమార్, ఎం. రాజేశ్వరరావు, పి.శ్రీదేవి, పి.ఆర్.రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జాతీయకరణ దినోత్సవాన్ని కొత్తపేటలోని జీవిత బీమా కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కన్నెగంటి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో సేకరించి, వారికి లాభదాయకమైన సేవలను ఎల్ఐసి అందిస్తోందని చెప్పారు. విద్యావేత్త జొన్నాధుల నరసింహారావు మాట్లాడుతూ 1956 జనవరి 19న అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జాతీయాకరణ చేసిన ఇన్స్యూరెన్స్ కంపెనీలలో ఎల్ఐసి ఒకటన్నారు. మచిలీపట్నం డివిజన్ నాయకులు వేదాంతం ఫణీంద్ర మాట్లాడుతూ రూ.ఐదు కోట్లు ప్రభుత్వ నిధులతో ప్రారంభమైన ఎల్ఐసి గత ఆర్థిక సంవత్సరం ముగింపుకు రూ. 34 లక్షల కోట్ల విలువైన ఆస్తులను కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు డివి సుబ్బారావు, టి.సురేష్, యజ్ఞ నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

రేటులో చేతివాటం!

(మొదటి పేజీ తరువాయి)

పడితే చిత్తడితో వినియోగదారులు, వ్యాపారుల ఇబ్బందులు చెప్పలేకుండా ఉన్నాయి. కృష్ణనగర్‌లోని కార్పొరేషన్ స్థలం రైతు బజారుకు కేటాయించారు. ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేవు. గతంలో ఉన్న దుకాణాల కంటే ఈ రైతు బజార్లలో దుకాణాల సంఖ్య దాదాపు సగానికిసగం తగ్గిపోయాయి. గతంలో పట్టాభిపురం రైతు బజారు నుంచి కృష్ణాశ్రమం, ఎన్‌టిఆర్ స్టేడియం, కృష్ణ నగర్ కార్పొరేషన్ స్థలం ఇలా పలు చోట్లకు మార్పు చేశారు. దీంతో దుకాణాల సంఖ్య బాగా తగ్గింది. వినియోగదారుల సంఖ్య కూడా తగ్గుతోంది. వ్యాపారం తక్కువగా ఉన్న విక్రయదారులకు ఖర్చులు తగ్గడంలేదు. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులతో కూరగాయల వ్యాపారం గిట్టుబాటు కావడంలేదని పలువురు విక్రయదారులు వాపోతున్నారు. అద్దె మినహాయింపు, మార్కెటింగ్ సిబ్బంది చేతివాటం లేకుంటే తమకు కొంత వెసులుబాటు ఉంటుందని వారు చెబుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

పురుగు మందు తాగాడు. సమీప పొలాల్లోని వారు ఇది గమనించి 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అందించే క్రమంలో కొద్దిసేపటికే లింగయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతునికి, భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రచారం చేయాలి

పల్నాడు జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మద్యం సేవించి వాహనాలు నడ పొద్దని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని గురువారం తన కార్యాలయంలో ఆయన ప్రారం భించారు.

జెసి మాట్లాడుతూ మద్యం సేవిం చి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమా దాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రతా సిబ్బందితో పాటు ఎన్జీవోలు కూడా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రచా రం చేయాలన్నారు. జిల్లాలో ఒక మహిళ స్వచ్ఛందంగా రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార సామగ్రిని తమ చేత ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సంవత్సరం 'స్వచ్ఛత పక్వడా' అనే నినా దంతో రోడ్డు భద్రతా వారోత్స వాలు జరుపు కుంటున్నామన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌కె దుర్గ పద్మజ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఒక సంవత్సర కాలంలో ఒక లక్ష యాభై వేల మంది చనిపోతున్నారని, దీనిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చనే ఒక నిర్ణయం తీసుకోవడం జరిగిం దన్నారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు కమిటీని కూడ నియమించిందని, వారి ఆదేశాలు మేరకే పల్నాడు జిల్లాలో కలెక్టర్.. చైర్మన్ గా జిల్లా రహదారి భద్రతా కమిటీ ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని చెప్పారు. ఈ కమిటీ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్,ఇంజనీరింగ్, ఎమర్జెన్సీ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని సుప్రీం కోర్టు కమిటీ నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 'రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' అని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సభ్యులు కోటేశ్వర రావు, బంగారయ్య, వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న జెసి తదితరులు

డోకిపర్రు అడ్డరోడ్డు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -మేడికొండూరు

రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో, ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని డోకిపర్రు అడ్డరోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగింది. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన ఆచప్ప గొర్రెలు మేపేందుకు వలస డోకిపర్రు అడ్డ రోడ్డు సమీపంలోని బిక్స్ కంపెనీ దగ్గర నివాసం ఉంటున్నాడు. నిత్యావసర సరుకులు కొనేందుకని పేరేచర్ల వెళ్లిన అతను, తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహంపై వస్తున్నాడు. గుంటూరుకు చెందిన రాము ఫిరంగిపురంలో రోజువారి వసూలు చేసుకుని చేసుకొని పేరేచర్ల వైపు వస్తున్నాడు.మార్గమధ్యంలో ఎదురెదురుగా వస్తున్న వీరి బైకులు అదుపుతప్పి బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాము, ఆచప్పకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ' ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- మాచర్ల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల సబ్ పోస్ట్ మాస్టర్ బి. వీరాంజనేయులు కోరారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కుటుంబ యజమాని ప్రమాదానికి గురైతే ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.399 ప్రీమియంతో గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. పాలసీదారులకు ప్రమాద బీమా రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. శాశ్వత, పాక్షిక, పెరాలసిస్ వంటి వాటికి భీమా 10 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రమాదంలో మందుల ఖర్చులకు రు.60 వేలు, పిల్లల చదువుకు 1 లక్ష రూపాయలు, రవాణా చార్జీలకు రు.25 వేలు, మట్టి ఖర్చులకు రు.5 వేల చొప్పున భీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకానికి 18 నుండి 65 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని అన్నారు.

పలుదేవర్లపాడులో ఇదేమి కర్మ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వైవి

'నవరత్నాల పేరుతో నయవంచన'

ప్రజాశక్తి - ముప్పాళ్ల

వైసిపి ప్రభుత్వం నవరత్నాలు పేరుతో ప్రజలను నయవంచనకు గురిచేస్తోందంటూ తెలుగుదేశంపార్టీ మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు ధ్వజమెత్తారు. మండలంలోని పలుదేవర్లపాడులో గురువారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి ఆంజనేయులు ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు అంద జేశారు. ప్రజా సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనం తరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రైతులను,అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తున్నారని విమర్శించారు. సాకులు చెప్పి.. పథకాలను పేదల దరిచేరకుండా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్య క్రమం లో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎ.సాంబయ్య, మండల టిడిపి అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఎ. అమరేశ్వరావు, రాజుపాలెం మండల టిడిపి అధ్యక్షులు పి. పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బలుసుపాడులో 'మాటామంతి'లో

'దుల్హన్'కు పదో తరగతి నిబంధన సరికాదు

ప్రజాశక్తి-పెదకూరపాడు

ముస్లింలను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలుగు మహిళ నేతలు విమర్శించారు. మండలంలోని బలుసుపాడులో గురువారం మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. దుల్హన్ పథకానికి పదవ తరగతి నిబంధన పెట్టడం, ఆ పథకం అందకుండా చేయడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎద్దేవా చేశారు. ఇమామ్ లకు కూడా నెల జీతాలు సక్రమంగా ఇవ్వటం లేదని, మదర్సాలలో చదివే పిల్లలకు అమ్మబడి ఇవ్వటం లేదని విమర్శించారు.

కార్యక్రమంలో షేక్ ముంతాజ్, చల్లా అనుపకళ, నూతక్కి ఈశ్వరి, కొండ్రు పద్మలత, సరిపూడి కృష్ణకుమారి, కె.సుజాత, వై.అరుణ, హవేదా, తావేరా. రహమత్, మస్తాన్ బీ, కాసింబీ తదితరులు పాల్గొన్నారు.

ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి నిధులు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

జలజీవన్ మిషన్ పథకం కింద మండలంలోని పాల్వాయి గేటు గ్రామంలో ఓ హెచ్ ఎస్ ఆర్ (ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్) నిర్మాణానికి 44.60 లక్షలు విడుదలైనట్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కే నరేంద్ర రెడ్డి తెలిపారు గురువారం సర్పంచి గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి తో కలిసి స్థలాన్ని పరిశీలించారు ఇప్పటికే ఫే -1 కింద 16.92 లక్షలతో పైపు లైన్ వేసి 300 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఒహెచ్ఎస్ఆర్ తో మరో రెండు వందల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామని, దీని సామర్థ్యం 60 వేల లీటర్లు అని వివరించారు.

సర్టిఫికెట్లు పోయినవి

పల్నాడు జిల్లా, సత్తెనపల్లి రూరల్ మండలం, వెన్నాదేవి గ్రామానికి చెందిన కిలారి విక్రమ్ తండ్రి: కిలారి శివకు చెందిన పదవ తరగతి, ఇంటర్మీడియట్, బీటెక్ లకు సంబంధించిన అన్ని రకముల సర్టిఫికెట్ల ఫైలు పోయినది. ది.2/01/2023 నాడు వెన్నాదేవి నుండి సత్తెనపల్లికి ఆటోలో వస్తుండగా సర్టిఫికెట్లు ఫైలు మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు కింది అడ్రస్ లో సంప్రదించగలరు.

కిలారి విక్రమ్,
తండ్రి.శివ
వెన్నాదేవి గ్రామము, సత్తెనపల్లి రూరల్ మండలం,
పల్నాడు జిల్లా. సెల్:7660807124

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 83,933
మిర్చి ఎగుమతి	: 79,342
మిర్చి నిల్వ	: 40,524

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 26,000
నెం.5	10,000- 24,000
273	10,000 - 19,500
341	8,500 - 24,000
4884	11,000 - 19,000
సూపర్ 10	9,200 - 13,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 24,000
బడిగి	10,000 - 27,000
దేవనూరు డీలక్స్	12,000- 27,000
తాలుకాయలు	4,000 - 12,000

గోలిలో సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల: మండలంలోని గోలిలో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డును ఎంపీడీవో గౌసియా బేగం గురువారం పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, సిసి రోడ్డు పది కాలాలపాటు ఉం డేలా నిర్మించాలని, ఈ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటా యించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పిఆర్ఎఇ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ మున్నా చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.184/2020

బిట్వీన్:-
గోపవరపు కృష్ణమూర్తి - వాది/పిటిషనర్
మరియు
కునాగు భాస్కరరావు
S/o రంగయ్య, హిందు,50 సం॥లు, వ్యాపారం, డోర్.నెం. 5-52, పిడుగురాళ్ళ(పోస్టు), పల్నాడు జిల్లా
- ప్రతివాది / రెస్పాండెంట్

పై నెంబరు దావాలో వాది / పిటిషనర్ ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం ప్రతివాది/రెస్పాడెంట్ మీద పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాది/రెస్పాడెంట్‌కి వాది పైకోర్టు ద్వారా ఎన్నిసార్లు కోర్టు సమన్లు మరియు ఐ.యస్. 364/2020 ఇన్ ఒ.యస్ 184/2020 మరియు ఐ.ఎ.నెం. 93/2022 ఇన్ ఒ.యస్. 184/2020లో నోటీసులు పంపించిననూ తీసుకొనకుండా ఊరిలో లేడని వెనకకు పంపించియున్నారు. పైనెంబరు దావాలో ఐ.ఎ.364/ 2020, ఐ.ఎ.93/2022 లోను ప్రతివాది /రెస్పాడెంట్‌కు సమన్లు మరియు నోటీసుల నిమిత్తం ది: 07-02-2023 తేదీన వాయిదా ఉన్నది. కావున్న సదరు తేదిన ప్రతివాది/రెస్పాడెంట్ పైవారి కోర్టులో ఉదయం 10.30.ని॥లకు స్వయముగా గాని, లాయరు ద్వారా గానీ హాజరులో వుండి తన ఆక్షేపణలను తెలుపు కొనవలెను, లేనిచో ప్రతివాది/రెస్పాడెంట్ పరోక్షము నందు దావాను, ఐ.ఎ.లను నిర్ణయించ బడునని తెలియజేయడమైనది.
వాయిదా తేది: 07-02-2023

(By order of Court)
Ekula Prem Kumar, B.A.,L.L.B.
Advocate
Piduguralla, Palnadu Dist.
Cell: 9440249927, 7993021621

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.211/2020

బిట్వీన్:-
మల్లెల శాంతి ....వాది
వర్సెస్
పఠాన్ ఖాజావలి ....ప్రతివాది
ప్రతివాది: పఠాన్ ఖాజావలి వరఫ్ చిన ఖాజావలి S/o షఫిఖాన్, డోర్‌నెంబరు 18-156/1 పాటిగుంతల, పిడుగురాళ్ళ.

దావా పరిహారములను కోరుతూ వాది మీపై పైకోర్టులో దావా వేసియున్నారు. మీరు పై కోర్టులో ది.24-02-2023 ఉదయం 10-30 ని॥లకు హాజరయి స్వయంగా గానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీపై పరోక్షమున తీర్మానించబడును.
పిడుగురాళ్ల
ది.08-01-2023
వాయిదా 24-02-2023

(By order of Court)
డి.చెన్నయ్య
వాది తరుపున న్యాయవాది, పిడుగురాళ్ల.

గ్రామ పంచాయతీ కార్యాలయం, జూపూడి

టెండరు ప్రకటన

ది.19-01-2023

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలము, జూపూడి గ్రామ పంచాయతీ పరిధిలో PMAGY మరియు **15వ ఆర్థికసంఘం నిధులతో** ఈ క్రింద ఉదహరించిన ఒక పనిని (01) టెండరు పద్ధతి పై పని చేయుటకు టెండర్లు కోరడమైనది. ది.30-01-2023 తేదీన ఉదయం గం.10.30.నుండి సాయంత్రం గం.3.00ల వరకు పంచాయతీ కార్యదర్శి లేక వారిచే అనుమతి పొందిన అధికారిచే సీల్డుకవర్ నందు టెండర్లు స్వీకరింపబడి తదుపరి అదే రోజు సాయంత్రం హాజరైన టెండరుదార్ల సమక్షములో టెండర్లు తెరవబడును. కావున టెండరు దాఖలు చేయదలచినవారు టెండరు 1% (అంచనా విలువలో) చెల్లించి సీల్డు కవరు నందు టెండరు దాఖలు చేయవలసినదిగా కోరడమైనది. టెండరుదారు గ్రామ పంచాయతీ వారికి రు.1500/-(నాన్ రిఫండబుల్) చెల్లించి టెండరు షెడ్యూలును పొందవలసినదిగా కోరుచూ అదనపు సమాచరము నిమిత్తము గ్రామ పంచాయతీ పనిచేయు వేళలో సంప్రదించవలసినదిగా తెలియజేయడమైనది.

వ.నెం.	పనిపేరు	అంచనా విలువ రూ.
1.	పొన్నూరు మండలము, జూపూడి గ్రామ పంచాయతీ పరిధిలో గల యస్.సి ఏరియాలో సి.సి. డ్రెయిన్స్ నిర్మాణము	10,80,000-00

టెండరు దాఖలు చేయుటకు అర్హతలు:
1. జీయస్‌టీ రిజిస్ట్రేషన్ 2. క్లాస్ 2 కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు 3. పాన్‌కార్డు

సం/- పంచాయతీ కార్యదర్శి,
గ్రామ పంచాయతీ, జూపూడి
పొన్నూరు మండలము, గుంటూరు జిల్లా.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో నాయకులు, బాధితులు

బాలిక అదృశ్యం ఘటనలో

వార్డెన్‌పై అట్రాసిటీ కేసు కోసం నిరసన

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని 7వ మైలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం కేసులో నిందితుడు వై.శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సిటియు నాయకులు అబ్రహం లింకన్, సిపిఎం నాయకులు బండ్ల మహేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలిక తల్లితో కలిసి తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అబ్రహం లింకన్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వార్డెన్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందారని, బాలికలకు మాయమాటలు చెప్పి లోబర్చుకునేవాడని చెప్పారు. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాల్సిన అధికారులు తాత్సారం చేస్తున్నారని, వెంటనే అతని ధ్రువపత్రాలను పరిశీలించాలని, నకిలీల తయారీకి సహకరించిన వారిపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పివెంకటేష్, పి.కుమారి, బి.కోటేశ్వరమ్మ, జానమ్మ, గురవమ్మ, సంపూర్ణ, అన్నమ్మ పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందితో సమీక్షలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

యడ్లపాడులో జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల పరిషత్ కార్యాలయాని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కె.హెనీక్రిస్టినా గురువారం సందర్శించారు. రికార్డుల పరిశీలనానంతరం సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎంపిపి పి.ఝాన్సీరాణి, ఎంపిడిఒ హనుమారెడ్డి, విస్తరణాధికారి బి.వరూధిని పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో తాగు నీటి సమస్య లేకుండా సత్వర చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు చెప్పారు. పట్టణంలోని 2వ వార్డులోని బోరు మరమ్మతులను గురువారం చేపట్టగా వీరు దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్.వెంకటేశ్వర్లు, ఆల్లీ జీవన్, ఎఇ శ్యామూల్, నాగుర్‌వలి పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

అసమానతలు తొలగాలని పద్యాలతో వేమన ప్రచారం

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- కొండవీడు కొండపై వేమన జయంతి సభ, విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, యడ్లపాడు

సమాజంలోని అసమానతలను తొలగించేందుకు, ప్రజల్లో చైతన్యం తేవడానికి ప్రజా కవిగా యోగి వేమన రచించిన పద్యాలు ఎంతో గొప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని కొండవీడు కోటపై వేమన జయంతి ఉత్సవాలు గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలభారతి, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథి అయిన మంత్రి రజిని మాట్లాడారు. కొండవీడు ప్రాంత కేంద్రంగా వేమన అనేక సామజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని, అందుకు అనే అనవాళ్లు కొండవీడు కొండలో ఉన్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ వేమన శతకాలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయని, వాటి ఆధారంగా ప్రజల జీవన విధానం పద్యాల రూపంలో వచ్చాయని తెలిపారు. సరళమైన తెలుగు పదాలతో వేమన పద్యాలు మౌఖికంగా విశ్వ వ్యాప్తి అయ్యాయని వివరించారు. ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ వేమన పద్యాలను మరింత ప్రచారం చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ కె.హెనీక్రిస్టినా మాట్లాడుతూ వేమన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ వేమన జయంతికి నెల రోజుల ముందు కొండవీడుకోటకు వచ్చే పర్యాటకులు, విద్యార్థులకు వేమన పద్యాల పోటీలను నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు మరింత అధికంగా చేపట్టాలని సూచించారు. అనంతరం వేమన పద్యాలతో ప్రజల్లో చైతన్యం తెస్తున్న కె.కొండారెడ్డి, యర్రం సాంబిరెడ్డి, వేమన మహేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వేమన శతకాల 7వ ముద్రణ ప్రతులు, 2023 కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి, పులిచింతల ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ వసంతబాబు, ఉద్యాన శాఖాధికారి బిజె.బెన్నీ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శోభారాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేమన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, జెడ్‌పి చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

ప్రత్యేక వైద్యశిబిరం

వేమన జయంతి సందర్భంగా కొండవీడు కొండపైన వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయగా శిబిరాన్ని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి, డిఐఒ బి.గీతాంజలి సందర్శించారు. డాక్టర్ శ్యామ్‌సన్, హెచ్ఎస్ కోటేశ్వరరావు, హెచ్‌వి గంగానమ్మ, ఫార్మాసిస్ట్ నభి, ఎంఎల్‌హెచ్‌పిలు శ్రీలక్ష్మీ, పద్మ, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటేశ్వరరెడ్డి, యలమందయ్య, బుజ్జి, పీరు పాల్గొన్నారు.

దుర్గిలో ఎడ్ల పందేల కోలాహలం

ప్రజాశక్తి-దుర్గి

మండల కేంద్రమైన దుర్గిని పాఠశాల మైదానంలో ఎడ్ల బండలాగుడు పోటీలను వి.గోపాలరావు గురువారం ప్రారంభించారు. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 69వ వార్షిక కళ్యామహోత్సవం సందర్భంగా కటకం రామారావు సారథ్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా రెండు పళ్ల విభాగంలో 9 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులతోపాటు యజమానులను నిర్వాహక కమిటీ సత్కరించింది. పోటీలను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి రైతులు, ప్రజలు తరలివచ్చారు.

లబ్ధిదార్లను అప్పులపాలు చేయొద్దు

- లైట్లు వేయగానే మౌలిక సదుపాయాలు కల్పించినట్టా?
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- ఇళ్ల నిర్మాణం లే అవుట్‌లో పరిశీలన
- అప్పుల పాలవుతున్నామని, ఇల్లు అమ్ముకోవాల్సి వస్తుందేమోనని లబ్ధిదార్ల ఆవేదన

ప్రజాశక్తి - నరసరావుపేట

వీధి దీపాలు పెట్టగానే మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కాదని, సిసి రోడ్లు, తాగునీటి వసతీ ఉండాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేట సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సిపిఎం నాయకులతో కలిసి విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న లబ్ధిదార్లతో మాట్లాడి అక్కడి పరిస్థితు, నిర్మాణ ఖర్చులు తదితరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఇల్లు కట్టలేకపోతున్నామని, నిర్మాణం చేయకుంటే స్థలం వెనుక్కు తీసుకుంటామని అధికారులు బెదిరించడంతో భయపడి రూ.2-5 వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేయించుకుంటున్నామని పలువురు లబ్ధిదార్లు వాపోయారు. చేసిన అప్పులు చెల్లించలేక ఇంటినే తెగనమ్ముకోవాల్సి వస్తుందేమోననే ఆందోళనను పలువురు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఒక్కో ఇంటికి రూ.5 లక్షలను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వమే పటిష్టంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై తాము ప్రజల్ని కదిలిస్తామని, కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదార్లు అప్పులు కాకుండా చూడాలని, ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని రాయితీపై ఇవ్వాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, వై.గోపాలరావు మాట్లాడుతూ నవరత్నాల్లో ఒక రత్నమైన పేదలందరికీ ఇళ్లు అనే రత్నం రాయిగా మారిందని ఎద్దేవ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ఎలా సరిపోతాయని, పైగా ఇల్లు కట్టకుంటే స్థలం తీసుకుంటామని బెదిరింపు దారుణమని మండిపడ్డారు. ఐదేళ్లలో 32 లక్షల మందికి ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం లక్ష్యంలో కనీసం 30 శాతమైనా చేరలేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి మాట్లాడుతూ 3వ ఆప్షన్ కింద ప్రభుత్వం నిర్మించి ఇస్తామనే చేపట్టిన నిర్మాణాల్లో అనేక లోపాలున్నాయని, నేల బీములతో నిర్మాణం సురక్షితం కాదని చెప్పారు. ఇప్పటికే కొంతమంది అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశారని, వారికీ ప్రభుత్వం రూ.5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదార్లను ఒత్తిళ్లకు గురిచేయకుండా డబ్బులు వెసులుబాటు కలిగే వరకు అవకాశం ఇవ్వాలన్నారు. పరిశీలనలో సిపిఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, నాయకులు మస్తాన్‌రెడ్డి, మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, హుస్సేన్, జిలాని మాలిక్ పాల్గొన్నారు.

లే అవుట్‌లో పరిశీలిస్తున్న విజయ్‌కుమార్, ఇతర నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

మూడున్నరేళ్లయినా జగనన్న కాలనీల్లో ఇళ్ల పునాదులకే పరిమితమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీని వారు సందర్శించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాలని, లేకుంటే 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. అప్పటికీ స్పందించకుంటే 22న చలో విజయవాడ నిర్వహిస్తామని చెప్పారు. ఈ అంశాలపై రూపొందించిన వినతిపత్రాల మీద సంతకాలు సేకరించారు. నాయకులు బి.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు, ఆర్.వందనం, సాంబయ్య, మల్లికార్జునరావు, శ్యాంసన్, అబ్రహాం, రామలింగయ్య, కోటేశ్వరరావు, మార్తమ్మ, సుబ్బాయమ్మ, రామలక్ష్మమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి రహదారి భద్రత నిబంధనలు

నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

వాహనదారులు సురక్షిత ప్రయాణానికి ప్రభుత్వం నిర్దేశించిన రహదారి భద్రత నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు అన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా జిల్లా రవాణాశాఖ రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కోసం నిర్వహించిన వాక్‌థాన్‌లో నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఉపరవాణా కమిషనర్ ఎస్.కె.కరీం పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్ నగరపాలెం సెంటరు మీదుగా మూడు బొమ్మల సెంటరు వరకూ కొనసాగింది. ర్యాలీలో విద్యార్థులు రహదారి భద్రత నిబంధనలపై రూపొందించిన ప్లేకార్డులు ప్రదర్శిస్తూ కొనసాగారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలు పాటించటం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఒక వ్యక్తిప్రాణాలు కోల్పోతే ఆకుటుంబం మొత్తానికీ కోలుకోలేని నష్టం జరుగుతుందన్నారు. వాహనదారులకు రహదారి భద్రత నిబంధనలపై రవాణా శాఖ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా వాక్‌థాన్, ర్యాలీ, సదస్సులు నిర్వహించటం అభినందనీయమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మట్ ధరించటం, ఫోర్ వీలర్ నడిపే వారు సీటు బెల్ట్ తప్పక ధరించాలన్నారు.అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారుల రక్షణ కోసమే రహదారి భద్రత నిబంధనలను అమలు చేస్తున్నారన్నారు. వాహనదారుల ఆలోచన విధానంలో మార్పు వచ్చి ఖచ్చితంగా భద్రత నిబంధనలు పాటించటం ద్వారానే రహదారి ప్రమాదాలు నివారించవచ్చున్నారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్ కే. కరీం మాట్లాడుతూ జిల్లాలోను గత సంవత్సర కాలంగా 1071 రహదారి ప్రమాదాలు జరిగాయని, వీటిల్లో 397 మంది మరణించగా, 1011 మందికి గాయాల పాలయ్యారన్నారు. ప్రమాదాల్లో 75 శాతం ద్విచక్ర వాహనాల ప్రమాదాలే ఉంటున్నాయని, అందువలన ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, రవాణా శాఖ అధికారులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మేయర్, తదితరులు

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-తెనాలి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి డిమాండ్ చేశారు. స్థానిక విస్సార్ కళాశాల సమీపంలోని ఐసీడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేశారు ఈ సందర్భంగా హుస్సేన్‌వలి మాట్లాడుతూ అంగన్ వాడీలకు ఫేషియల్ యాప్ రద్దు చేయాలన్నారు. అలాగే పర్యవేక్షణ పేరుతో అంగన్‌వాడీల మీద వేదింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. వైఎస్సార్ పోషణ పథకానికి మెనూ కేటాయింపులు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఒకటిని కూడా తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు ప్రాజెక్టు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎవిఎన్ కుమారి, కె.జ్యోతి, పి.హైమావతి, వరలక్ష్మి, సీహెచ్ శివకుమారి, నాగమల్లీశ్వరి, విజయలక్ష్మి, అతాస్, హేమలత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాలలో అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈమని ప్రాజెక్టు సిడిపిఒకి సిఐటియు మండల ఉపాధ్యక్షులు జెట్టి బాలరాజు, అంగన్వాడీ నాయకులు జయ, ఎం అదిలక్ష్మి, కె మధులత, కె నాగమణి, ఎస్ హేప్సీ, పి నీలవేణి తదితరులు వినతి పత్రం అందజేశారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఫేస్ ఆఫ్ రద్దు చేయాలని కోరుతూ ప్రత్తిపాడు సిడిపిఒ కు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి టి జ్యోతిరాణి మాట్లాడుతూ అంగన్వాడీలకు గత ఎనిమిది సంవత్సరాలుగా టి ఏ లు చెల్లించడం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు కనీసమైన సౌకర్యాలు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించడం, ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని, రూరల్ ప్రాంతాలలో నెట్ సౌకర్యం సరిగ్గా లేక ఇప్పటికే ఫోటోలు అప్లోడ్ కాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇక పేస్ యాప్ ద్వారా అటెండెన్స్ ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ,సిడిపిఓ, సూపర్వైజర్ పర్యవేక్షిస్తుండగా అదనంగా ఫుడ్ కమిషనర్లు, సచివాలయాలు పర్యవేక్షణ అధికారులు పేరుతో అంగన్వాడీలను చాలా చోట్ల మానసిక వేధింపులు గురి చేస్తున్నారన్నారు. అనేక చోట్ల రాజకీయ వేధింపులకు అంగన్వాడీ కార్యకర్తలు బలవుతున్నారన్నారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతన 26,000, ఫేస్ యాప్ రద్దు, పర్యవేక్షణ పేరుతో వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శోభారాణి, యు.జ్యోతి, ఆదిలక్ష్మి,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : అంగన్వాడి వర్కర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా గురువారం మంగళగిరి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం వినతి పత్రం ఐసిడిఎస్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు,సిఐటియు మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

తెనాలి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ప్రత్తిపాడులో వినతిపత్రం ఇస్తున్న జ్యోతిరాణి తదితరులు

దుగ్గిరాలలో

మంగళగిరిలో

ధాన్యం పరిశీలిస్తున్న సాంబిరెడ్డి తదితరులు

ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-తెనాలి

ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్న అధికారుల హామీ ఆచరణలో అమలు కావటంలేదని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. స్థానిక ఐతానగర్‌లోని రైతులు మేకల చిట్టిబాబు తదితరుల వద్ద ఉన్న ధాన్యాన్ని, దాన్ని విక్రయించటంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురువారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదులో అధికారులు చేసిన తప్పులు రైతుల పాలిట శాపంగా మారాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుండా, కార్యాలయాలకు పరిమితమై ఈ క్రాప్ నమోదు చేసినందువల్ల తప్పులు దొర్లాయని, దాని ఆధారంగా నమోదులో ఒక రకం ధాన్యం, దిగుబడిలో మరో రకం ధాన్యం ఉన్నాయన్న వంక చూపుతున్నారన్నారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఈ క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని, లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. అలాగే గేతడాది ధాన్యం రవాణా ఖర్చులు రైతులకు చెల్లించటేదని, తక్షణమే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మేకల చిట్టిబాబు, అత్తోట లక్ష్మయ్య, కూచిపూడి బాబురావు, వేజండ్ల నాగేశ్వరరావు, మేకల చక్రవర్తి పాల్గొన్నారు.

షటిల్‌లో సత్తా చాటిని నెహ్రూ నికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి:

సంక్రాంతి శలవుల్లో నిర్వహించిన షటిల్ బ్యాట్మింటన్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అభినందించారు. స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరాలను వెల్లడించారు. రూరల్ గ్రామం కొలకలూరులో కరుణానిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజిమెన్ స్మారకంగా కొత్త ఐజక్‌శ్మామ్ బ్యాట్మింటన్ అసోసియేషన్ ఈనెల 11 నుంచి 14 వరకూ నిర్వహించిన గుంటూరు, పల్నాడు, బాపట్ల, నరసరావుపేట, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి షటిట్ బ్యాట్మింటన్ విభాగంలో పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎ.సంజయ్, తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.అరవింద్ అండర్ 15 బాలుర విభాగంలో పాల్గొని, ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించటం పాఠశాలకే గర్వకారణమన్నారు. విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ మురళీకాంత్

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు - 22న తుళ్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం శాశ్వతంగా కొనసాగించాలనే అంశంపై గురువారం కెవిపిఎస్ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. కెవిపిఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జె నవీన్ ప్రకాష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ,ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ను శాశ్వతంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇతర పథకాలకు కేటాయించిన ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను తిరిగి ఎస్సీ ఎస్టీ ల ప్రయోజనాలకే వినియోగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ ల ప్రయోజనాల పట్ల టిడిపి, వైసిపి, బిజెపి పార్టీలకు చిత్త శుద్ధి లేదన్నారు. కార్యక్రమం లో వైసిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శంగారపాటి సందీప్, దళిత బహుజన జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య, అమరావతి దళిత జెఏసి మహిళా కన్వీనర్ అంకం సువర్ణ కమల, జేఏసీ నాయకులు మేరిగ దాసు, సీఐటీయూ నాయకులు పేరం బాబురావు, మేరిగ సరిత, అంకం నాగరాజు, మధుసూదన రావు పాల్గొన్నారు. 22వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తుళ్లూరులోని బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం, మానవహారం నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. నిరసనలో దళిత, గిరిజన యువత, విద్యావంతులు, అంబేద్కర్, జగ్జీవన్ రాం యువజన సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - మంగళగిరి : ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలని కోరుతూ గురువారం మంగళగిరిలోని నియో జకవర్గ శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డిని కెవిపిఎస్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్ బాబు, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు బుస స్వామినాథన్, ఏనుగుల కమలాకర్, కొండమీద జోసెఫ్, సిక కోటేశ్వరరావు, కారుమంచి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

రోడ్డు ప్రమాదాల బారిన యువత

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో పాటు వాటిని పాటించాలని, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పల్నాడు జిల్లా రవాణా శాఖ అధి కారి టి.కె పరందామ రెడ్డి సూచించారు. పల్నాడు జిల్లాలో 34 వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక నరస రావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదరి భద్రతపై అవగహన సదస్సు జరి గింది. పరంధామరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిం చక పోవడం వలన అధిక సంఖ్యలో యువత రోడ్డు ప్రమా దాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ రూల్స్ పాటించక పోవడమేనన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చెయ్యడం అత్యంత ప్రమాదకరమని విద్యార్థులకు వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుద్ధమన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని, వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్ ఆక్సిడెంట్స్ జరగడానికి గల పలు కారణాలను విద్యార్థులకు వివరించారు. వీడియో ప్రదర్శన ద్వారా మోటార్ వాహన చట్టం లోని రూల్స్ మరియు రెగ్యులేషన్స్ ని విధ్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రావ్య , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీల్, ఎన్. ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ ఐ. శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె పరందామరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు..

ఈ-క్రాప్ బుకింగ్ పరిశీలన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని లింగంగుంట్ల ఆర్బికేలో గురువారం జరిగిన ఈ క్రాప్ బుకింగ్‌ను పల్నాడు జిల్లా జిల్లా వ్యవసాయ అధికారైన ఐ. మురళి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలోపు ఈ పంట నమోదు ప్రక్రియ, రైతుల ఇ-కెవైసి ప్రక్రియ పూర్తి కావాలని విఎఎలను ఆదేశించారు. నరసరావుపేట సహాయ వ్యవ సాయ సంచాలకులు పి.మస్తా నమ్మ, చిలకలూరిపేట మం డల వ్యవసాయ అధికారి టి.శ్రీలత, ఎఇఒ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుమ్మకోటకు రూ.20 లక్షలు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని తుమ్మకోటలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు విడుదల చేసినట్లు పిఆర్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నిధు లతో గ్రామంలోనే ఎస్సీ ,బీసీ కాలనీలో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండలంలోని బొల్లవరంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు గురువారం ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిబిఆర్‌సి మహిళ కోఆర్డినేటర్ మేడే వెంకట రమణ మాట్లాడుతూ పంటలపై రైతులు అధిక పెట్టుబడి పెట్టి తక్కువ ఆదాయం పొందుతున్నారని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఆదాయాన్ని మెరుగు పరుచుకునే విధంగా సేంద్రీయ పద్ధతిలో కషాయాలు తయారు చేసుకుని తక్కువ ఖర్చుతోటి ఎక్కువ లాభాలు పొందేలా ప్రయత్నించాలని అన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటు అయితే సబ్సిడి ద్వారా విత్తనాలు ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు, నాబార్డు నుంచి బ్యాంకు రుణాలు, సబ్సిడీలు పొందవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతూ సద్వి నియో గం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగయ్య, శ్రీనివాస రావు ,రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రేపు జై భీం భారత్ పార్టీ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఈ నెల 21 న విజయవాడలో జై భీం భారత్ పార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లి లీగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు , న్యాయవాది జె. విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు . రాష్ట్రంలో పది శాతంగా వున్న ముస్లిం మైనార్టీలు జనాభా ప్రాతిపదికన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో ప్రభుత్వ రాయతీలు, హక్కుల తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

'సబ్‌ప్లాన్'ను శాశ్వతంగా అమలు చేయాలి

దళిత, గిరిజన, ప్రజా సంఘాల నిరసన, వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

భారత రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ ప్రజలకు జనాభా ప్రాతికపదిన నిధులు కేటాయించి వారికి కావాల్సిన విద్యా,వైద్యం ఉపాధి, మౌలిక సదుపాల కల్పన కోసం కృషి చేయాలని చట్టాలు చెబుతున్నాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక తహ శీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)డివిజన్ కార్యదర్శి ఎం. ల్యూన్ అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013వ సంవత్స రంలో అమలు అయిందని, పదేళ్ల పాటు కొనసాగించేలా అప్పటి పాల కులు చర్యలు తీసుకున్నా రన్నారు. ఈ నెల 23 తో ఈ చట్టం గడువు ముగియ నుందని, ప్రభుత్వం ఈ చట్టాన్ని శాశ్వ తంగా కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని నాయ కులు హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎన్. రవికుమా ర్‌కు నాయకులు వినతిపత్రం అంద జేశారు. ఎస్.బాబు, సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, బిఎస్పి జిల్లా నాయకులు ఎన్. కోటేశ్వరరావు, సమతా సైనిక దళ్ జిల్లా నాయకులు వంజా ముత్తయ్య, ఎస్సి, ఎస్టీ నాయ కులు ఎస్. నాగరాజు, బి.చిన్న నాయక్, బి.కోటా నాయక్, పి.సుబ్బారావు, వి. వాక్య నాయక్ తో పాటు దళిత, గిరిజన , ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేసులతో నన్ను భయపెట్టే లేరు : మంత్రి అంబటి

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

తనపై కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ఎన్నో విషమ పరిస్థితులను ఎదుర్కొనే తాను ఈ స్థాయికి వచ్చానని రాష్ట్ర మంత్రి అంబటి రాం బాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వడ్డెర నేతల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా, మృతుడు పల్లపు రోశయ్య కుటుంబానికి ఆర్య వైశ్యుల సహ కారంతో రూ.2.50 లక్షల చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అంద జేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రత్యర్థుల పార్టీలకు తాను సింహ స్వప్నంగా మారిన నేపథ్యంలో తనను లక్ష్యంగా చేసుకొని తనను అభాసుపాలు చేసేందుకు కుట్ర చేస్తు న్నారని ఆరోపించారు. గత నెలలో ధూళిపాళ్ళ లో నిర్వహించిన సభలో తాను కాపుల గుండెల్లో కుంపటి అని, ఇన్సూరెన్స్ విషయంలో రూ 2.50 లక్షలు అడుగుతున్నానంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై ఆరోపణలు చేశా రని, ఈ ఆరోపణలో ఎంత మాత్రం నిజంలేదని, ఇది తనపై చేస్తున్న నిందా రోపణలు అంటూ కొట్టిపారేశారు. హోటల్‌లో జరిగిన సం ఘటనలో వాస్తవాలు తెలుసు కోకుండా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అదే విధంగా ముగ్గుల పోటీలలో తాను దోచు కున్నానని కూడా ప్రచారం చేస్తున్నారని విమ ర్శించారు. ప్రశాంత వాతావరణంలో ముగ్గుల పోటీలను అందరి సహకారంతో విజయవంతం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సాంబశివరావు, ఆర్. పురుషోత్తం, కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంజిఆర్ లింగారెడ్డి, బాసులింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు .

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే బొల్లా

ప్రజాశక్తి-ఈపూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు అన్నారు. మండలంలోని బోడెపూడివారి పాలెంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నాడు-నేడు, రైతు భరోసా కేంద్రాలు, గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న అంశాల గురించి ప్రస్తావించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ బి.మాధవి, జెడ్పిటిసి టి.చౌడయ్య, తహశీల్దార్ సిహెచ్ విజయ్ జ్యోతికుమారి, ఎంపిడిఒ ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

వేమనకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నివాళి

ప్రజాశక్తి-అమరావతి

మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ..

మండలపరిధిలోని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రజాకవి వేమన 351వ జయంతిని నిర్వహిం చారు. సమాజంలో మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్న రోజుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా వేమన పద్యాలు రాశారని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొ న్నారు. మానవత్వం పరిమళింపచేసేని, నవ సమాజం వైపు అడుగులు వేయించిన మహనీయుడు వేమన అని తెలుగు ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, పద్మజలు అన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె. సలావుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**చిలకలూరిపేట:**స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం ప్రజాకవి వేమన జయంతి కార్య క్రమం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మహాత్మా జ్యోతిరావు పూలే సేవ సంఘం అధ్య క్షులు ఉప్పాల భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటి కార్యదర్శి డి.బుజ్జిబాబు, కె.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి డి.వీర్రాజు, సిబ్బంది గోవిందు సరోజిని, సాంబిరెడ్డి తదితరులు ఉన్నారు. **యడ్లపాడు:**స్థానిక శాఖా గ్రంథాలయంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. గ్రామపెద్ద పి. గంగయ్య చౌదరి, వేమన ఫొటోకు పూలమాల వేసి నివాళలర్పిం చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, శివరామకృష్ణ, సంజీవరావు, కోటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. **పెదకూరపాడు:** మండలంలోని 75తాళ్లురులో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో వేమన జయంతి నిర్వహించారు. మాజీ ఎంపిపి ఈదా సాంబిరెడ్డి, కవి రామకోటిరెడ్డి, డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణికోట, అత్తలూరులలో వైసిపి కార్యకర్తలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి

మండలంలోని ధరణికోటకు చెందిన రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు నరుకుదురు నాగరాజు తండ్రి అంకమ్మ రాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. నాగుల్ మీరా, మేదర రాజు వైసిపి నాయకులు, కె.కోటేశ్వర రావు, భవిరిశెట్టి. హనుమంతరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించిన సిపిఎం నేతల బృందం

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్

పెదనందిపాడులో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లబ్ధిదారునికి ఇస్తున్న రూ.లక్షా80వేలు చాలడం లేదని రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం మండల విస్తత సమావేశం పెదనందిపాడు లోని విశ్రాంత ఉపాధ్యాయుల భవనంలో కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లాలో 68,948 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతుండగా ఇళ్ల నిర్మాణం మాత్రం 10 శాతం కూడా పూర్తవ్వలేదన్నారు. మరో 10 శాతం బేస్ మట్టం వరకు పూర్తి చేసుకుని, ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బు చాలక పనులు ఆపేసినట్లు తమ సర్వేలో తేలిందని తెలిపారు. జగనన్న ఇళ్ల స్థలాలకు విద్యుత్, మంచినీరు, రోడ్లు, డ్రైనేజ్ సౌకర్యాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ఆపివేశారని, ఈ క్రాప్ నిబంధనలతో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు జరగడం లేదని తమ దష్టికి వచ్చిందని, ప్రభుత్వ నిబంధనల వల్ల ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధరకు, ప్రతి రైతు దగ్గర నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించే జీవో నంబర్ 1 వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్చి పంటకు బొబ్బర తెగులు, ఎర్రనల్లి సోకి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడులకు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తుందని, వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి వీటి నివారణకు సూచనలు చేయాలని, నష్ట పరిహారం కొరకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని కోరారు. జిల్లాలో 10,000 మంది సామాజిక పెన్షన్ దారులకు నోటీసులు పంపించారని కరెంటు బిల్లు, ఇంటి వైశాల్యం , బాడుగకు తిప్పుకునే కార్లు వంటి వివిధ కారణాలతో పెన్షన్లు తీసివేయడం తగదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, డి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కాపు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో మీడియాతో మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి - దుగ్గిరాల :మండలంలోని 13 గ్రామాల్లోని జగనన్న కాలనీలను సిపిఎం బృందం సర్వే చేశామని లబ్ధిదారులు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకు వచ్చారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు తెలిపారు. గురువారం షాదీఖానాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దుగ్గిరాల మండలంలో 2567 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, వీరిలో కేవలం 106 మంది మాత్రమే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారని, సుమారు 1861 ఇళ్లు బెల్ట్ లెవెల్ లోనే ఆపివేశారని, మరొక 538 మంది బేస్ మట్టం లెవెల్ వరకు నిర్మాణం చేసి ఆపివేశారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 1,80,000 ఇంటి నిర్మాణానికి సాలటం లేదని ఐదు రూపాయలకు వడ్డీ తేవాల్సిన పరిస్థితి వస్తుందని వాపోయారని తెలిపారు. ఇసుక, సిమెంటు, ఇనుము, ఇటుక ధరలు విపరీతంగా పెరిగాయని ఈ పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టగలమని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి తెచ్చుకునే సామాగ్రి కూడా ఇంటి వద్దకు చేర్చుకోవడానికి విపరీతమైన ఖర్చు అవుతుందని తెలిపారని ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని అప్పారావు కోరారు. కార్యక్రమంలో సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు కే.కోటయ్య, ఏసు పాదం, పి .నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

పొన్నూరులో జగనన్న కాలనీ పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం లోని జగనన్న కాలనిలోని ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత మెటీరియల్ ధరలకు అనుగుణంగా 5లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం బృందం జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలించారు. కాలనీలో సుమారు 5020 మందికి పట్టాలు ఇవ్వగా, కేవలం 90 మంది మాత్రమే ఇంటిని పూర్తి చేసుకున్నారని, కేవలం 300 మంది మాత్రమే పునాదులు వరకు వేసి డబ్బులు లేక నిర్మాణం ఆపుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని ఐదు లక్షలు ఇవ్వాలని, ఇప్పటికే నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నూరు సిపిఎం నాయకులు ఎం రమేష్ బాబు, శివన్నారాయణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సర్వేలో ఇంటికో సమస్య వెలుగులోకి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజలు ఇంటికో సమస్య చెబుతున్నారని అధికారలు తక్షణమే వాటిని పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం సర్వేలో భాగంగా మంగళగిరిలో గోపాల్ కష్ణ సెంటర్, పావురాల కాలనీ, మార్కండేయ కాలనీ మంగళగిరి, రాజీవ్ గృహకల్ప, 27, 29 సచివాలయాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జెవి రాఘవులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఇంటి పన్ను ఒక్కసారిగా 500 నుండి రెండు వేలకు పెరిగిన ఒక పేద కుటుంబం తమ బాధను సిపిఎం బృందానికి తెలిపింది. మరొక కుటుంబం తమకు వచ్చిన ఇంటికి డబ్బులు కట్టలేదని మాజీ కౌన్సిలర్ తమ ఇంటిని అమ్ముకున్నట్లు సిపిఎం బందానికి తెలిపారు. మంచాలు తయారు చేస్తూ చేతివత్తిపై ఆధారపడ్డ ఒక కుటుంబానికి వ్యాపారం లేకపోవడంతో కుటుంబం గడవట్లేదని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వటం లేదని విన్నవించారు. వద్ధాప్య పెన్షన్ అర్హులైన వద్ధులకు ఇవ్వకుండా కరెంట్ బిల్లు, ఇంటి స్థలం (వేరే వాళ్ళకి బదలాయించినప్పటికీ) ఇతర కారణాలు చూపించి రద్దు చేస్తున్నారని అనేకమంది వద్ధులు వాపోయారు. చెత్తపై పన్ను వేయడాన్ని వ్యతిరేకిస్తున్న ప్పటికీ వచ్చే సంక్షేమ పథకాల్లో కత్తిరిస్తామని కార్డు వాలంటీర్ల ద్వారా బెదిరించి వసూళ్లు చేస్తున్నారని ఇలా అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని వీటన్నిటిపై ఈ నెల 25న మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి శ్రీరాములు, ఇ కాటం రాజు, ఎం బాలజీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : దయనీయమైన పరిస్థితిలో ఇంటిపనివారలు ఆదాయాలు చాలక అలమటిస్తున్నారని సిపిఎం సర్వే బృందం వారు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎర్రగడ్డ, నులకపేట, లూర్దునగర్ ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెత్తపన్ను కట్టనందుకు డబ్బాలో ఉన్న చెత్తను తీసి తన చేతిలో పెట్టారని కాకుమాను శౌరమ్మ , సిపిఎం బృందం ముందు వాపోయింది. ఇంటిపన్ను రశీదులు లేవని, ఇళ్లకు కరెంట్ మీటర్లు అనుమతించడం లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, ఎ.శవిరిబర్తులోం, పి.మార్టిన్ పాల్గొన్నారు. సుందరయ్యనగర్‌లో 25వ రోడ్డు, నాలుగు అంతర్గత రోడ్లలో సర్వే నిర్వహించారు. సైడ్ కాల్వలు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు సిపిఎం బృందానికి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.కరుణాకర్‌రావు, పి. గిరిజ, కె.ఉషారాణి, జ్యోతి, భ్రమరాంబ, జి.అరుణ తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లి సెంటర్‌లోని వినాయకనగర్‌లో సిపిఎం నాయకులు సర్వే నిర్వహించారు. ఇళ్ల పట్టాలు, రోడ్లు, మంచినీటిసౌకర్యం, డ్రైనేజ్ సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఇ.రామారావు, పిహెచ్ సుందరరావు, పి.గాంధీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తాడేపల్లి మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇల్లు నిర్మించాలని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కొలను కొండ గ్రామంలో సిపిఎం పార్టీ ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు పేదలు తాము ఉంటున్న నివాస స్థలాలను రెగ్యులర్ చేసి, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులతో విన్నవించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలో 2200 మంది లబ్ధిదారులు ఉన్నారని ప్రభుత్వమే లెక్కలు తేల్చిందని ఆయన అన్నారు. ఒక ఇప్పటం గ్రామం లో కొద్ది మందికి మినహా ఏ ఒక్క గ్రామంలో కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికీ తాడేపల్లి మండలంలో కొండ పోరంబోకు, పిడబ్ల్యుడి స్థలాలలో పేదలు వేసుకొని జీవిస్తున్న నివాస స్థలాలను రెగ్యులర్ చేసి, ఇళ్ల పట్టాల మంజూరు చేసి, గహ నిర్మాణ పథకం కింద ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రగడ్డ బాబు, ఎస్ కే భాష పాల్గొన్నారు.

72 గజాలు ఇంటికి రూ.1360 పన్ను

ప్రజాశక్తి - మంగళగిరి : పావురాల కాలనీ ఇర్లా. కొండయ్య,ఇర్లా. సుజాత వారి కుటుంబం కేవలం 72 గజాల రేకుల ఇంట్లో నివాసముంటున్నారు. అయినా వారికి రూ.1360 ఇంటి పన్ను వేశారని నాయకులకు తెలిపారు. తమతో పాటు ఆ ప్రాంతంలో 12 ఇళ్ళకు పన్నులు వేశారని అందరికీ ఇంటికి 50 రూ. మాత్రమే పన్నుల వేయగా మాకు మాత్రమే 1360 రూ. వేశారని వాపోయారు.

విభజన హామీలు నెరవేర్చకుంటే డిపాజిట్లు దక్కవు

నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అప్పికట్ల శ్రీహరి నాయుడు

ప్రజాశక్తి - మంగళగిరి : ఏపీకి ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చకుంటే ఏపీలో బీజేపీ, బిఆర్ఎస్‌లకు రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అప్పికట్ల శ్రీహరి నాయుడు పేర్కొన్నారు. నగరంలోని ఐబీఎన్ ప్రెస్ క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీలు ఆంధ్రుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏపీకి ప్రత్యేక హోదా అమలు పర్చాలన్నారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. షెడ్యూలు 9,10,13లలో పొందుపర్చిన అన్ని సంస్థలు తక్షణమే నెలకొల్పాలని, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న లక్షల ఖాళీల్లో ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఆరేపల్లి మణికంఠ, గొడవర్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సజ్జలకు టెక్నీషియన్ల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి :తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకష్ణారెడ్డి కార్యాలయంలో బుధవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రిఫ్రిజరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. రాష్ట్రంలో రిఫ్రిజరేషన్, ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్స్ ఎదుర్కొం టున్న పలు సమస్యలను వినతి పత్రం రూపంలో సజ్జలకు అందజేశారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది రిఫ్రిజరేషన్, ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్స్ ఉన్నారని, వారు ప్రభుత్వం నుండి ఏవిధమైన సహాయ సహకారాలు పొందడం లేదని, కనీసం గుర్తింపు లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో సజ్జల మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మషద్ జాని, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వీర శంకర్ యాదవ్, నజీర్, రహమాన్, జిల్లా అధ్యక్షులు షేక్ మన్సూర్, మంగళగిరి అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రషీద్ తదితరులు సజ్జలకు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఎపి రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శిగా గోపాలరెడ్డి

ప్రజాశక్తి - చేబ్రోలు : యోగి వేమన జయంతి గుంటూరు హౌసింగ్ బోర్డులోని ఎపి రెడ్డి సంఘం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రెడ్డి సంఘం జనరల్ సెక్రటరీగా వేజెండ్ల గ్రామానికి చెందిన తమ్మినేని గోపాలరెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా కొత్తరెడ్డిపాలెంకు చెందిన శ్రీరెడ్డికి ఎపి రెడ్డి సంఘం వైస్ ప్రెసిడెంట్ ఇంటూరి సాంబశివరావు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు రాష్ట్ర అధ్యక్షులు, ఆఫీసు కార్యదర్శిగా ఎస్ నరేష్ కుమార్ రెడ్డి, కార్యదర్శిగా కె రామకృష్ణ బాధ్యతల్లో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - మంగళగిరి : కంతేరు గ్రామంలో పొలంలో గుళికలు వేసి అస్వస్థకు గురైన 20 మంది వ్యవసాయ కూలీ లకు మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు సిపిఎం పార్టీ పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజి డిమాండ్ చేశారు. గురువారం పెదకాకాని మండలంలోని ఉప్పలపాడులో వ్యవసాయ కార్మికులను వారు పరామర్శి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బుధవారం కంతేరు నిడమర్రు మధ్యన ఈ సాంబశివరావు గారి పొలంలో 20 మంది వ్యవసాయ కార్మికులు మొక్కజొన్న పంటకుగుళికల మందు వేయడానికి వెళ్లారని, అందులో పౌడర్ కలిపి వేయడం వల్ల పొలం పనికి వెళ్ళిన 20 మంది కార్మికులకు వాంతులు నీరసం రావడం, కళ్ళు తిరిగి పడిపోవడం జరిగింది. వీరందరికీ మొత్తం ఆరోగ్యం కుదురుపడే వరకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదకరమైన టువంటి మందులు చల్లేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని పనిచేయించాలని కోరారు. అలాగే బుధవారం పొలంలో పనిచేసిన వారందరికీ కూడా పని కోల్పోయిన అన్ని రోజులు నష్టపరిహారం కూడా ఇవ్వాలని కోరారు.

జపాన్ పర్యటనకు వర్సిటీ ఫార్మసీ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జపాన్ పర్యటన ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏ ప్రమీల రాణి గురువారం తెలిపారు. వర్సిటీ ఫార్మసీ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులను మెరిట్ జాబితా ప్రకారం ఎంపిక జరిగిందని వారికి జపాన్ వెళ్ళటానికి ఆహ్వానం లభించిందన్నారు. జనవరి 22 నుండి 28 వరకు జపాన్ లో పర్యటించి అక్కడ జరుగుతున్న విద్యా విషయాక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని రానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను వర్సిటీ విసి పి రాజశేఖర్, రెక్టార్ పి. వర ప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి చెన్నారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి సిద్దయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల రాణి లు వారిని అభినందించారు.

నైపుణ్యాల మేళవింపుతోనే రాణింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : విద్యార్థులు పాఠ్యాం శాలతో పాటుగా సామాజిక అంశాలపై కూడా పట్టు సాధించడం అవసరమని, జీవితంలో ఎంత ఎదిగినా మన మూలలను మరువ కూడదని వెల్లూరు విట్ విద్యాలయ ఉపకులపతి, తమిళనాడు మాజీ మంత్రి వర్యులు ఆచార్య జీ విశ్వనాథన్ పేర్కొన్నారు. విద్యార్థులను విజయ పథంలో నడిపించేందుకు విద్య సామాజిక అంశాలలో చైతన్య వంతం చేసేందుకు ఎలాంటి కార్యక్రమాలకైనా విశ్వవిద్యాలయం సంసిద్ధమని చెప్పారు. విద్యార్థులు ఏకాగ్రతతో క్రమశిక్షణతో ఆచార్యులు బోధించే విద్య సంబంధిత విషయాలను నేర్చుకుని భవితకు ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ పట్టేటి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహనా పెంపొందించుకోవాలని చెప్పారు. ఇరు విశ్వవిద్యాలయాల విద్యాభివృద్ధికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

తాడికొండకు సాగునీటి సమస్యను పరిష్కరించాలి

కలెక్టర్‌కు కత్తెర సురేష్‌కుమార్ వినతి

ప్రజాశక్తి-గుంటూరు

తాడికొండ నియోజకవర్గంలో పేరేచర్ల, బండారుపల్లి మేజర్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ గురువారం జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. పేరేచర్ల, బండారుపల్లి మేజర్‌కు 280 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉందని, కానీ ఎగువున పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ళ వద్ద పవర్ ప్లాంట్‌లకు నీటిని వినియోగించటం వల్ల మేజర్ చివరి భూములకు నీరు అందక, తాడికొండ నియోజక వర్గంలోని విశదల, బండారుపల్లి, మందపాడు, పొన్నెకల్లు, రావెల, గరికపాడు, దామరలిపల్లి, పాములపాడు నుండి పెదపరిమి వరకూ పలు గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. గత అనేక సంవత్సరాలుగా ఈసమస్య ఉందన్నారు. ప్రస్తుతం 80 క్యూసెక్కులు నీరు కూడా రావట్లేదన్నారు. ప్రస్తుతం మిర్చి కోతలు ప్రారంభమయ్యాయని, వెంటనే రైతులు పొలాలకు నీరు పెట్టాల్సి ఉందన్నారు. కావున సత్వరమే సరిపడా సాగునీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని సురేష్‌కుమార్ కలెక్టర్‌ను కోరారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసి కత్తెర సురేష్‌కుమార్

వివిఐటి విద్యార్థులతో చిత్ర బృందం క్రికెట్

ప్రజాశక్తి-తెనాలి : వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల విద్యార్థులతో వినరో భాగ్యము విష్ణుకథ చిత్ర బృందం నంబూరు కళాశాల ప్రాంగణంలో గురువారం క్రికెట్ మ్యాచ్‌లో తలపడింది. అల్లు ఆరవింద్ సమర్ప ణలో జిఎ2 పిక్చర్ బ్యానర్‌పై కిరణ్ అబ్బవరం, కాశ్మీరా హీరో హీరోఇన్లుగా తెరకెక్కిన చిత్రం వచ్చేనెల 17న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం యూనిట్ కళాశాలను సందర్శించింది. విద్యార్థులతో కలిసి క్రికెట్ మ్యాచ్ అడిన అనంతరం చిత్ర ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా విద్యార్థులు సందడి చేశారు. క్రికెట్‌లో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ గా నిలిచిన కళాశాల విద్యార్థి సైదులు చేతుల మీదుగా 'ఓ బంగారం' పాటను విడుదల చేశారు. హీరో కిరణ్ మాట్లాడుతూ అన్ని వర్గాలను అలరించే విధంగా చిత్రం రూపుదిద్దుకుందన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిత్రం అనూహ్యామైన విజయం సాధించాల న్నారు, కార్యక్రమంలో నిర్మాత, దర్శకులు బన్నీవాసు, కిషోర్, సంగీత దర్శకులు చేతన్ భరద్వాజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జున రెడ్డి, పిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.అరుణ కుమార్, డాక్టర్ గిరిధర్, పాల్గొన్నారు.

విద్యార్థులతో చిత్రం యూనిట్ బృందం

వేమన పద్యాలతో ప్రజల్లో చైతన్యం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యోగి వేమన ఆధునిక భావ విప్లవకారుడని హేతువును ఆయుధంగా చేసుకొని అంధవిశ్వాసాలు, మూఢనమ్మకాలు, కుల మత మూఢత్వాలపై ప్రజలను చైతన్యవం తులను చేసిన సంఘ సంస్కర్త అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం జనచైతన్య వేదిక హాలులో ప్రజాకవి యోగి వేమన 371వ జయంతి సభ నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత ముఖ్య అతిథిగా విచ్చేసిన పాపినేని శివశంకర్ ప్రసంగిస్తూ సి.పి.బ్రౌన్, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకష్ణ శర్మల కృషి ఫలితంగా వేమన పద్యాలు వెలుగులోనికి వచ్చాయన్నారు. తెలుగు జాతికి దార్శనికతను అందించిన మహనీయులు యోగివేమన అనికొనియారు. శాసన మండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ జాతీయ ఉద్యమంలో భాగంగా ప్రారంభమైన సాంస్కృతిక పునర్జుజీవన ఉద్యమం మళ్లీ రావాలని కోరారు. ప్రజాకవి వేమన పద్యాలు నేటికి సజీవంగా ప్రజల హృదయాలలో వున్నాయన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఎంపిక చేసిన 100 యోగి వేమన పద్యాలను ముద్రించి ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఆటవెలదిలో ప్రతి తెలుగువారికి అర్ధమయ్యే సామాన్య భాషలో యోగి వేమన వేలాది పద్యాలను రచించారని తెలిపారు. అరసం జాతీయ నేత పెనుగొండ లక్ష్మినారాయణ ప్రసంగిస్తూ యోగి వేమన పద్యాలు ప్రజలలో ప్రశ్నించే లక్షణాన్ని పెంపొందించాయని, హేతువాద దృష్టిని అందించాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మోదుగుల రవిక్రిష్ణ ప్రసంగిస్తూ పద్య రచనలోకెల్లా మాధుర్యం ఆటవెలదిలో వుందన్నారు. యోగి వేమన ఆధునిక యుగ వైతాళికుడని, ఆధునిక యుగ బుద్ధునిగా వర్ణించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్, మానవత చైర్మన్ పావులూరి రమేష్, ప్రముఖ సాహితీవేత్త వి. సింగారావు, ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ. నారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న పాపినేని శివశంకర్, వేదికపైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్.పి.లు సుప్రజ, శ్రీనివాసరావు,కోటేశ్వరరావు వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుంటూరు : నిజ జీవిత సత్యాలను, మానవతా విలువలను పద్యాల రూపంలో ప్రజలకు అందించిన మహనీయుడు, ప్రజా కవి యోగి వేమన అని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. గురువారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిలా, అదనపు కమిషనర్ పి.రోజ, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. వేమన జయంతిని పురస్కరించుకొని స్థానిక అరండల్‌లోని అవగాహన కార్యాలయంలోవేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాకవి యోగి వేమన 351వ జయంతి సందర్భంగా కలక్టరేట్‌లో గురువారం వేమన చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ సాహిత్యంలో మొట్టమొదటి అభ్యుదయ కవి యోగి వేమన అని తెలిపారు. మహాకవి శ్రీశ్రీ తెలుగు కవిత్వానికి తిక్కన, వేమన, గురజాడ మూలపురుషులు అన్నారు. అంతేకాక గుర్రం జాషువా పద్య కవిత్వం రాయటానికి ప్రేరణ, తెలుగు సాహిత్యం పద్యరూపంలో ప్రాచుర్యం పొందడానికి మూలం వేమన అని వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు, స్టెప్ సిఈఓ పి.వెంకటనారాయణ, సాంఘిస సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మధుసూదనరావు, డిఎస్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్‌యు :తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన అభ్యుదయవాది ప్రజాకవి వేమన కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతమైన వ్యక్తి ప్రజా కవి యోగి వేమన అని ఒంగోలు మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య వీ.నాగ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగిన ప్రజా కవి వేమన జయంతి ఉత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా కీలకోపన్యాసం చేశారు. **తుళ్లూరు:** రాయపూడిలోని మండల పరిషత్ (మెయిన్) ప్రాథమిక పాఠశాలలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. **పెదనందిపాడు:** శాఖ గ్రంథాలయం పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో వేమన జయంతిని గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాకుమానులో జెవివి ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి పూలమాలే వేసి నివాళులర్పించారు.

వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, జెసి తదితరులు

తెనాలి తహశీల్దార్ కార్యాలయానికి పవర్ కట్

పేరుకుపోయిన రూ.3.50 లక్షల విద్యుత్ బకాయిలు

ప్రజాశక్తి-తెనాలి : మండల తహశీల్దార్ కార్యాలయానికి విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గత కొన్నేళ్ళగా విద్యుత్ బకాయిలు పేరుకుపోవటంతో విధిలేని పరిస్థితిలో గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్‌మేన్ విద్యుత్ ఫ్యూజులు తొలగించారు. ఫలితంగా ఉదయం 11 గంటల నుంచి కార్యాలయానికి విధ్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది విధులకు హాజరైనా పనిచేసే పరిస్థితి లేదు. అలాగే కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన సందర్శకులూ గంటల కొద్ది వేచి చూసినా ఫలితం లేకపోయింది. దాదాపుగా మూడేళ్ల నుంచి విద్యుత్ బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లిచంటంలేదన్నది సమాచారం. అప్పుడప్పుడు విద్యుత్ శాఖ ఒత్తిడితో కొద్దికొద్దిగా చెల్లించినప్పటికీ బకాయి భారీ మొత్తంలో పేరుకుపోయింది. విద్యుత్ శాఖ అధికారులు గణాంకాల ప్రకారం దాదాపుగ రూ.3.50లక్షలు ఉందని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ డీఈ బి.అశోక్ కుమార్ వివరణ కోరగా అప్పుడప్పుడూ కొద్దికొద్దిగా చెల్లించినా, ప్రస్తుతం బకాయి రూ.3.30లక్షలు ఉందన్నారు. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న కారణంగా సంబంధిత అధికారి నుంచి లిఖిత పూర్వక హామీతో విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే కార్యాలయం నుంచే విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం ఏమిటని ప్రజలంటున్నారు. పేద వర్గాల నుంచి బలవంతంగా విద్యుత్ బకాయిలను వసూలు చేసే ప్రభుత్వమే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

తహశీల్దార్ కార్యాలయం


ఫ్యూజులు పీకిన దృశ్యం